విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి: ఏవో

దహెగాం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఆహారభద్రత మిషన్ పథకంలో రైతులకు వందశాతం రాయితీపై అందించే వరి ధాన్యం విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో రామకృష్ణ అన్నారు. గురువారం మండలకేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో వరిధాన్యం విత్తనాలను పంపిణీ చేశారు. మండలానికి కెఎన్ఎం-1638రకం విత్తనాలను ప్రభుత్వం వందశాతం రాయితీపై అందించిందన్నారు.

ఏకలవ్య పాఠశాలలో అధికారులు విచారణ

కాగజ్‌నగర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాలలో బుధవారం విద్యార్థి శ్రీధర్(15)ను ఉపాధ్యాయుడు రవిశంకర్ యాదవ్ చితకబాదిన ఘటనపై రీజినల్ కోఆర్డినేటర్ (ఆర్సీఓ) అగస్త్యన్ గురువారం విచారణ జరిపారు. విద్యార్థి శ్రీధర్‌ను ఉపాధ్యాయుడు ఎందుకు కొట్టాల్సి వచ్చింది..? అనే అంశాలపై తోటి విద్యార్థులతో అడిగి తెలుసుకున్నారు. అలాగే తల్లిదండ్రులు కూడా ఉపాధ్యాయులపై దాడిచేసిన సంఘటనపై అక్కడే ఉన్న సిబ్బందితో వాకాబు చేశారు. విచారణ జరుపుతున్న సమయంలో మీడియాను అను మతించలేదు. ఈ విషయమై ఎస్సై సందీప్ వివరణ కోరగాను ఏకలవ్య రెసిడెన్షియల్ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

కొనసాగుతున్న సర్వే

సిర్పూర్(టి)/కాగజ్‌నగర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి), కాగజ్‌నగర్ మండలాల్లో ఇందిరమ్మఇళ్ల సర్వే కొనసాగుతున్నది. ఇంటి యజమానులు ఆధార్‌కార్డు, ఇంటి స్థలం పత్రాలు, రేషన్‌కార్డు, గతంలో ఇంటి టాక్స్‌కట్టిన రశీదులు దగ్గర ఉంచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. కార్యక్రమాల్లో ఈవో తిరుమతి, కార్యదర్శి షాహిమాబాను, ఎంపీడీవో రమేష్ తదితరులున్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

కాగజ్‌నగర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలంలోని ఈసుగాం సమీపంలో వారం రోజుల క్రితం కాగజ్‌నగర్‌కు చెందిన రవి తన సెల్ ఫోన్‌ను పోగొట్టుకోగా ఈసుగాం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఆధునిక సాంకేతికతను వినియోగించి గురువారం రవి సెల్ ఫోన్ ఆచూకీ కనుగొని అతనికి అందజేశారు.

బోధన అస్తవ్యస్తం



మెడికల్ కాలేజీలో నిరసన తెలుపుతున్న వైద్య విద్యార్థులు

- మెడికల్ కాలేజీలో అరకొర సిబ్బంది
- కనీస వసతులు, బోధన సామగ్రి కరువు
- తరగతులు సరిగా జరగడం లేదని జూడాల ఆందోళన
- బోధన సిబ్బందిని నియమించాలని, వసతులు కల్పించాలని డిమాండ్

ఆసిఫాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం లోని అంకుశాపూర్ గ్రామశివారులో ఉన్న ప్రభుత్వవైద్య కళాశాలలో కనీస మౌళికవసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ వైద్య విద్యార్థులు ఆందోళనకు దిగారు. గురువారం కళాశాల ఎదుట తరగతులను బహిష్కరించి ప్లకార్డులను ప్రదర్శిస్తూ నిరసన చేపట్టారు. కళాశాలలో మౌలిక వసతులు లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. కళాశాలలో వైద్య విద్యను బోధించే ప్రొఫెసర్లు, అసోసియోటెడ్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు లేక తరగతులు పూర్తిస్థాయిలో జరగడంలేదని అవేదన వ్యక్తం చేశారు. దీంతో తాము ఎంతో నష్టపోతున్నామన్నారు.

రాష్ట్రంలో మిగతా జిల్లాలో ఉన్న మెడికల్ కళాశాలల్లో అన్ని వసతులు మెరుగ్గా ఉన్నప్పటికీ ఇక్కడ వసతులు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. సమస్యలపై పలుమార్లు మంత్రితో పాటు ఎమ్మెల్యే, కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లినా ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. కళాశాలలో మెడికల్ రీసెర్చ్‌కు కావాల్సిన క్యాడవర్స్ (డెడ్ బాడీలు) ఎనిమిది ఉండాల్సి ఉండగా ఒక్కటి కూడా లేదన్నారు. దీంతో తాము ప్రాక్టికల్స్ ఎలా చేస్తామని అవేదన వ్యక్తం చేశారు. ల్యాబ్, ల్యాబ్‌లో కెమికల్స్ కూడా లేవని ఆసుపత్రిలో వైద్యులు లేరని గైనకాలజిస్టు డిపార్ట్‌మెంట్ లేకపోవడంతో తాము విషయ పరిజ్ఞానాన్ని పొందలేక పోతున్నామన్నారు.

పూర్తిగా లేని ప్రొఫెసర్లు..

జిల్లాలో గతేడాది కొత్తగా మెడికల్ కళాశాల ఏర్పాటైంది. ఈ కళాశాలలో రెండేళ్లలో ఏటా 100మంది చొప్పు న విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. కళాశాలలో 27మంది ప్రొఫెసర్ పోస్టులు మంజూరు కాగా కేవలం ఇద్దరు మాత్రమే పని చేస్తున్నారు. 25పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 30మంది అసోసియోటెడ్ ప్రొఫెసర్ల పోస్టులకుగాను కేవలం ఒక్కరే పని చేస్తుండగా 29 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అసిస్టెంట్ ప్రొఫెసర్ 58పోస్టులకు గాను నలుగురు మాత్రమే ఇక్కడ పని చేస్తుండగా 54పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో కళాశాలలో మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులకు వైద్యవిద్య బోధించేందుకు సరిపడా సిబ్బంది లేకపోవడంతో బోధన అస్తవ్యస్తంగా మారింది. కళాశాలలో ల్యాబ్‌సౌకర్యం, ల్యాబ్‌లో పరికరాలు లేకపోవడంతో విద్యార్థులు ప్రాక్టికల్స్‌కు ఇబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ప్రాక్టికల్స్ కోసం వైద్య కళాశాలలో డెడ్‌బాడీలు లేకపోవడంతో పూర్తి స్థాయిలో విద్యార్థులు విషయపరిజ్ఞానాన్ని పొందలేక పోతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యపోస్టులు ఖాళీగా ఉండటంతో పలు అంశాలను నేర్చుకోలేకపోతున్నారు.

వసతిగృహాల్లో శానిటేషన్ చర్యలు చేపట్టడంలేదని వాష్ రూంలు కంపుకొడుతున్నాయన్నారు. వసతి గృహాల్లోని పైపెచ్చులు ఊడిపడుతున్నాయని భయం భయంగా ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. కళాశాలలో మౌళికవసతులు కల్పించాలని ప్రొఫెసర్స్, అసోసియోటెడ్ ప్రొఫెసర్స్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను వెంటనే భర్తీచేసి అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు అందజేశారు.

వసతులు అధ్వానం..

మెడికల్‌కళాశాల విద్యార్థులు వసతిగృహాల్లో వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. మొదటి, ద్వితీయ సంవత్సరం వైద్యవిద్యార్థులకు జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో వసతిగృహాలను ఏర్పాటు చేశారు. ఇందులో వసతులు సక్రమంగా లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు.

మార్కెట్‌కమిటీ కార్యాలయంలో సీనియర్ గర్ల్స్ 52మంది, పాత కలెక్ట రేట్‌లో జూనియర్ గర్ల్స్ 56 మంది, మెడికల్ కళాశాలలో సీనియర్ బాలురు 48మంది, పాత డీఆర్‌డీవో కార్యాలయంలో జూనియర్ బాలురు 20మంది, ప్రభుత్వ ఆసుపత్రి భవనంలో జూనియర్ బాలురు 24మందికి మొత్తం 200 మంది విద్యార్థులకు హాస్టల్‌లను ఏర్పాటు చేశారు. ఆయా హాస్టల్‌లలో కనీస వసతులు కరువయ్యాయి. ఒక్కో గదిలో 10 నుంచి 15మందిని ఉంచుతున్నారని విద్యార్థులు వాపోతున్నారు. వాష్‌రూంలు నిర్వహణలేక కంపుకొడుతున్నాయని పైకప్పు పెచ్చులు ఊడిపడుతున్నాయని విద్యార్థులు పేర్కొంటున్నారు.

ప్రొఫెసర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి:

రశ్మిత, సెకండ్ ఇయర్ వైద్య విద్యార్థి



కళాశాలలో విద్యను బోధించే ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను వెంటనే భర్తీచేయాలి. కళాశాలలో వసతులు సరిగ్గాలేవు. ల్యాబ్‌లో పరికరాలు లేకపోవడంతో ప్రాక్టికల్స్‌కు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రిలో గైనకాలజిస్టు డిపార్ట్‌మెంట్ లేకపోవడంతో విషయపరిజ్ఞానాన్ని పొందలేకపోతున్నాం. వసతిగృహాల్లో చాలా సమస్యలు ఉన్నాయి. వెంటనే పరిష్కరించాలి.

మౌలిక వసతులు కల్పించాలి..

ప్రణీత, ఫస్ట్ ఇయర్ వైద్య విద్యార్థి



కళాశాలలో కనీస మౌలిక వసతులు లేవు. వైద్యవిద్యను బోధించేందుకు అధ్యాపకులు లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నాం. కళాశాలలో మెడికల్ రీసెర్చ్ ఎడ్యుకేషన్‌కు ఉపయోగపడే క్యాడవర్స్(డెడ్‌బాడీలు) ఎనిమిది ఉండాల్సి ఉండగా ఒక్కటి కూడా లేదు. దీంతో విషయపరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో నేర్చుకోలేక పోతున్నాం. ప్రభుత్వం దృష్టి సారించి మెడికల్ కళాశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలి.

జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు


ప్రొసీడింగ్ కాపీని చూపుతున్న మాజీఎమ్మెల్యే ఆత్రం సక్కు, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు అన్నారు. జిల్లాకేంద్రంలోని ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి సంబంధించిన ప్రొసిడింగ్ కాపీని మాజీఎమ్మెల్యే ఆత్రంసక్కుతో కలిసి జర్నలిస్టులకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో జర్నలిస్టులు ఎదురుచూస్తున్న ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణం కాంగ్రెస్ హయాంలోనే చేపడుతామని తెలిపారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో చేపట్టే నాలుగుపనుల కోసం రూ.57లక్షలు ఎస్డీఎఫ్ నిధుల కింద మంజూరైనట్లు తెలిపారు. ఆసిఫాబాద్ పట్టణంలో జర్నలిస్టుల భవన నిర్మాణానికి రూ.25లక్షలు, గుండాల గ్రామంలో అభివృద్ధి పనుల కోసం రూ.8లక్షలు, రెబ్బెన మండలం గంగాపూర్ గ్రామంలో కమ్యూనిటీ షెడ్లనిర్మాణం కోసం రూ.10లక్షలు, ఆలయ ముఖద్వారం నిర్మాణం కోసం రూ.14లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. వీలైనంత త్వరగా నిర్మాణ పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బాలేష్‌గౌడ్, మల్లేష్, చరణ్, అబ్దుల్లా, అసద్, విశాల్, సలాం, జర్నలిస్టులు పాల్గొన్నారు.

క్రీడలు శరీర దారుఢ్యాన్ని కలిగిస్తాయి..

ఆసిఫాబాద్: క్రీడలు శారీరక దారుఢ్యాన్ని కలిగిస్తాయని జిల్లా కాంగ్రెస్‌కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని క్రీడామైదానంలో నిర్వహిస్తున్న క్రికెట్‌పోటీలను మాజీ ఎమ్మెల్యే ఆత్రంసక్కుతోకలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ క్రీడల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. క్రీడాపోటీలు నిర్వహిస్తున్న యూత్‌సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో నాయకులు బాలేష్‌గౌడ్, మల్లేష్, అబ్దుల్లా, అసద్, సలాం, ఖలీల్, అఫ్రోజ్, అదిల్, జుబేర్ తదితరులు పాల్గొన్నారు.

జోడేఘాట్‌ను సందర్శించిన ఏఎస్పీ


మ్యూజియంలో ప్రతిమలను తిలకిస్తున్న ఏఎస్పీ చిత్తరంజన్

కెరమెరి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): జోడేఘాట్‌ను ఏఎస్పీ చిత్తరంజన్ గురువారం సందర్శించారు. ఈసందర్భంగా మ్యూజియంలోని ప్రతిమలను తిలకరించారు. మ్యూజియం రికార్డు అసిస్టెంట్‌ను జల్,జంగల్, జమీన్ పోరాటాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందుతున్న బోధన గురించి అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు భీంవిగ్రహానికి, సమాధికి పూల మాల వేసి ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ రాజేశ్వర్, సీఐ సత్యనారాయణ, ఎస్సై విజయ్‌కుమార్ సిబ్బంది ఉన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

బెజ్జూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగవెల్లికి చెందిన ఆత్రం షణ్ముఖ కుటుంబానికి గురువారం శారదాదేవియూత్ సభ్యులు రూ.18,100నగదును అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నారు. మంగళవారం రాత్రి ఇప్పలగూడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో షణ్ముఖ తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో శారదాదేవియూత్ సభ్యులంతా చందాలు వేసుకొని కుటుంబసభ్యులకు నగదును అందజేశారు. యూత్‌సభ్యులను గ్రామస్థులు అభినందించారు.

ఆకట్టుకున్న ఆనంద్ మేళా


కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే హరీష్ బాబు

కాగజ్‌నగర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బుధవారం రాత్రి నిర్వహించిన ఆనంద్‌మేళా కార్యక్రమం ఆకట్టుకుంది. కార్యక్రమంలో జిల్లాలోని కళాకారులు గ్రూపుడ్యాన్సులు చేశారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిశాఖ ఆధ్వర్యంలో జాతీయస్థాయి అవార్డుల మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీష్‌బాబు, ఎస్పీఎం జీఎం గిరి మాట్లాడుతూ కాగజ్‌నగర్‌లో నూతన సంవత్సరవేడుకలు నిర్వహించటం హర్షణీయమన్నారు. అవార్డులు పొందిన కళాకారులను అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆర్గనైజర్ డొంగ్రీ సంతోష్, ప్రముఖ వైద్యులు డాక్టర్ విద్యాసాగర్‌తో పాటు తెలంగాణ ధూంధాం కళాకారులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే..

కాగజ్‌నగర్ పట్టణంలోని శ్రీమిత్ర సేవాసమితి రూపొందించిన క్యాలెండర్లను గురువారం ఎమ్మెల్యే హరీష్‌బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీ మిత్ర సేవాసమితి సభ్యులు సేవలు మరింతగా చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్పీఎం జనరల్ మేనేజర్ గిరిబాబు, సేవాసంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ విద్యాసాగర్, వ్యవస్థాపకుడు సుంకరి తిరుపతి పాల్గొన్నారు.

రిటైర్డ్ సీఆర్పీఎఫ్ ఎస్సైకి ఘనస్వాగతం

ఢిల్లీలో సీఆర్పీఎఫ్ బెటాలియన్ ఎస్సైగా పనిచేసి పదవీ విరమణ పొంది గురువారం కాగజ్‌నగర్‌కు వచ్చిన ఆర్ఎస్‌సర్కార్‌కు కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీష్‌బాబు ఆర్ఎస్ సర్కార్‌కు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనదారులు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి: ఎంవీఐలు

వాంకిడి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని ఎంవీఐలు తిరుపతి, శంకర్ అన్నారు. గురువారం స్థానిక చెక్‌పోస్టువద్ద వాహనదారులకు పూలు ఇస్తూ రోడ్డుభద్రతపై అవగాహన కల్పించారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, కారు డ్రైవర్లు సీట్‌బెల్టు పెట్టుకోవాలని సూచించారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపరాదని ఓవర్‌టేక్ చేయడం మితిమీరిన వేగంతో నడపడంవల్ల రోడ్డుప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయని సూచించారు.



వాహనదారులకు పూలు ఇస్తున్న ఎంవీఐలు

జిల్లా అభివృద్ధికి సమన్వయంతో ముందుకు సాగాలి


వాంకిడిలో వంటలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధికి అందరూ సమన్వయంతో ముందుకు సాగాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం జిల్లాలోని అన్నిశాఖల అధికారులు, ఉద్యోగులు, జర్నలిస్టులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు కలెక్టర్, అదనపు కలెక్టర్‌లు దీపక్ తివారి, డేవిడ్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీ దండె విఠల్, డీసీసీఅధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో లోకేశ్వర్, డీపీఆర్వో సంపత్‌కుమార్, ఆయాశాఖలఅధికారులు, జర్నలిస్టులు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెనూప్రకారం భోజనం అందించాలి..

వాంకిడి: మెనూప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం మండలంలోని బంబార ఆశ్రమ పాఠశాలను, వంట గదిని పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. వసతిగృహ పరిసర ప్రాంతాలతోపాటు వంట గదిని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పదవతరగతి పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని సూచించారు. ఉత్తమ ఫలితాల సాధనకు కృషిచేయాలన్నారు. అనంతరం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిర్పూర్(యు)లో 7.3డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు

ఆసిఫాబాద్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మళ్లీ చలిపంజా విసురుతోంది. గురువారం సిర్పూర్(యు) మండలంలో రాష్ట్రంలోనే అత్యల్పంగా 7.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. తిర్యాణిలో 8.0 డిగ్రీలు, కెరమెరిలో10.1డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తుపానుప్రభావంతో కొన్నిరోజులుగా చలి తీవ్రత తగ్గినప్పటికీని రెండురోజుల నుంచి మళ్లీ జిల్లాలో చలితీవ్రత పెరిగింది. దీంతో ఏజెన్సీ మండలాల్లో అత్యల్పఉష్ణోగ్రతలు నమోదవు తున్నాయి.

5నుంచి కొనుగోలు కేంద్రాల మూసివేత

బెజ్జూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకారసంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఈ నెల 5 నుంచి మూసివేస్తున్నట్లు ఐకేపీ ఏపీఎం మోహన్ లాల్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ఆలోగా ధాన్యంను తీసుకురావాలన్నారు.

మిరపతోటల పరిశీలన

పెంచికలపేట, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంట్లపేట, పోతెపల్లి గ్రామాల్లో మిరపతోటలను గురువారం ఉద్యానవనశాఖ అధికారి సుప్రియ పరిశీలించారు. వాతావరణ మార్పుల కారణంగా మిరపతోటలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు.

ఆపరేషన్ స్మైల్-11ని విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా చేపడుతున్న ఆపరేషన్ స్మైల్-11ను విజయవంతం చేయాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆపరేషన్ స్మైల్-11 కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. జనవరి1 నుంచి 31వరకు నిర్వహించే ఆపరేషన్ స్మైల్-11ను జిల్లాపోలీసులు, మహిళాఅభివృద్ధి, శిశుసంక్షేమ, కార్మిక, విద్య, ఆరోగ్యశాఖలు, చైల్డ్‌ప్రొటెక్షన్ యూనిట్, ఎన్‌జీవో అధికారులతో కలిసి జిల్లాలోని రెండు సబ్ డివిజన్‌లలో రెండుటీంలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా బాల కార్మికులు, చిన్నారుల దుర్భరస్థితిలో ఉండే ప్రాంతాలను తెలుసుకొని వాటిని బ్లాక్‌స్పాట్‌లుగా గుర్తించి చిన్నారులను విముక్తి కలిగించాలన్నారు. ప్రధానంగా రైల్వేస్టేషన్‌లు, బస్‌స్టేషన్‌లు, ట్రాఫిక్ కూడళ్లు, మెకానిక్ షాపులు, ఇటుక బట్టీలు, టీస్టాళ్లు, హోటళ్లు, ఫ్యాక్టరీలు, వర్క్‌షాప్‌లు, దుకాణాలపై ప్రత్యేకదృష్టి సారించాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ ప్రభాకర్, డిస్ట్రిక్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ మహేష్, డీఎంహెచ్‌వో సీతారాం, డీఈవో యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కుటుంబాలకు అండగా నిలుస్తాం..

పోలీసు కుటుంబాలకు అండగా నిలుస్తామని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. గురువారం జిల్లా పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో కాగజ్‌నగర్‌టౌన్‌పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ గతనవంబరు4న గుండెపోటుతో మృతిచెందిన మడావిఆనంద్ కుటుంబసభ్యులకు పోలీసు కోఆపరేటివ్‌సొసైటీ ద్వారా మంజూరైన రూ.1,21,000చెక్కును ఎస్పీఅందజేశారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ పెద్దయ్య, జిల్లా పోలీసు సంఘం అధ్యక్షుడు ఎం విజయశంకర్‌రెడ్డి, సొసైటీ అకౌంటెంట్ జాఫర్, సీసీ కిరణ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

ఆసిఫాబాద్ రూరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ఎస్ఎస్ఏ ఉద్యోగుల దీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం నాటికి దీక్షలు 24వ రోజుకు చేరుకోగా కలెక్టరేట్ నుంచి అంబేద్కర్‌చౌక్ వరకు తిరిగి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. సమ్మెలో భాగంగా శుక్రవారం రక్తదానశిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగులు మోహన్, తుకారాం, నాగసుధ, నాగేష్, పవన్‌కుమార్, సందీప్, నలంద, అరుణ, మీనా, కవిత తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

పెంచికలపేట, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం పీఆర్టీయూ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు గంగాభవాని, బే సాహెద్, లక్ష్మి, సంతోష్, భారతి, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

జైనూర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోచంలొద్దిలో షేక్‌ఖయ్యుం ఇంట్లో నిలువ ఉంచిన 1400 గ్రాముల గంజాయిని టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి పట్టుకున్నట్లు జైనూర్ ఎస్ఐ సాగర్ గురువారం తెలిపారు. షేక్ ఖయ్యుంను అదుపులోకి తీసుకుని కేసునమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. గంజాయి విలువ సుమారు 35 వేల రుపాయలు ఉంటుందని ఎస్ఐ తెలిపారు.

కొనసాగుతున్న హమాలీల దీక్ష


ఆసిఫాబాద్‌లో దీక్షలో కూర్చున్న హమాలీలు

ఆసిఫాబాద్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పెరిగిన రేట్ల జీవోను వెంటనే విడుదల చేయాలని కోరుతూ సివిల్‌సప్లయిగోదాం హమాలీలు జిల్లా కేంద్రంలోని మార్కెట్‌యార్డులో చేపడుతున్న దీక్ష కొనసాగుతోంది. గురువారం దీక్షలను సీఐటీయూనాయకులు సుధాకర్, కృష్ణమాచారి, రాజేందర్ సందర్శించి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో హమాలీలు శ్రీనివాస్, మోహన్, తుకారాం, కొమురక్క, సత్యనారాయణ, కిషన్, అంజి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జైనూర్: మండలకేంద్రంలో సివిల్‌సప్లయి హమాలీలు తలపెట్టిన నిరవధిక సమ్మె గురువారం రెండోరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా హమాలీలు సివిల్‌సప్లయి గోదాంవద్ద ధర్నా నిర్వహించారు. హమాలీ యూనియన్ మండల అధ్యక్షుడు మేస్రాం ఇంద్రు, జిల్లా ప్రధానకార్యదర్శి సుధాకర్, జిల్లా ఉపాధ్యక్షుడు బోగె ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

కొందరికే పీఎం కిసాన్ సమ్మాన్





- పథకంలో ఏటా తగ్గుతున్న లబ్ధిదారుల సంఖ్య
- అవగాహనలేక నష్టపోతున్న అన్నదాతలు

రెబ్బెన, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రైతులకు పెట్టుబడి, ఇతర అవసరాల కోసం కేంద్రప్రభుత్వం ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్‌నిధి పథకాన్ని ప్రవేశపెట్టింది. అర్హత కలిగిన రైతులకు సంవత్సరంలో మూడు విడతలుగా రూ.2వేల చొప్పున మొత్తం రూ.6 వేల నగదును నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేస్తోంది. అయితే ఈ పథకం అమలులో ప్రభుత్వం తీసుకువచ్చిన నిబంధనలు రైతుల పాలిటంగా మారుతున్నాయి. ఏటా రైతుల సంఖ్య పెరుగుతున్నా.. ఈ పథకం ద్వారా లబ్ధిపొందుతున్న వారి సంఖ్య మాత్రం తగ్గుతూ వస్తోంది. ప్రతి రైతు ఆధార్‌నంబరు అనుసంధానం చేసుకోవాలనే నిబంధన విధించింది. పూర్తిస్థాయి అవగాహణ లేక అనేక మంది ఆధార్ అనుసంధానం చేసుకోలేదు. దీంతో వారు పథకానికి దూరమవుతున్నారు.

కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఈ పథకం ద్వారా రైతుకు 16విడతల్లో రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం జమచేసింది. తాజాగా మంగళవారం 17వ విడత సైతం జమ చేయగా, ప్రారంభంలో ఉన్న అర్హులైన రైతులతో పోల్చితే ప్రస్తుతం వారిసంఖ్య తగ్గింది. జిల్లాలో 15మండలాల పరిధిలో 1.38 లక్షల మంది రైతులున్నారు. చిన్న, సన్నకారు రైతులకు ప్రయోజనం చేకూరాలనే లక్ష్యంతో ప్రారంభంలో ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని ఐదెకరాల లోపు భూమి ఉన్న వారిని మాత్రమే అర్హులుగా గుర్తించారు. అప్పుడు జిల్లాలో 69,601మంది అర్హులుగా ఉండగా, 17వ విడతో వారి సంఖ్య 34,827కు తగ్గిపోయింది. పథకం అమలులో ప్రభుత్వం పలురకాల నిబంధనలు, షరతులు విధించటంతో చాలామంది పథకానికి దూరమవుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయపు పన్ను చెల్లించే వారికి పథకాన్ని నిలిపివేశారు. కుటుంబలో భార్యభర్తలిద్దరికి ఈ పథకాన్ని వర్తింపజేయగా, ప్రస్తుతం కుటుంబలో భార్య లేదా భర్తకు ఒక్కరికి మాత్రమే వర్తింపజేస్తున్నారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం అమలులో అవినీతి, అక్రమాలకు చోటులేకుండా ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పలు రకాల నిబంధనలు, షరతులు విధించింది. అర్హులు తప్పనిసరిగా పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ఐడీనెంబరు ఆధార్‌ను అనుసంధానం చేసుకోవాని సూచించింది. అయితే గ్రామాల్లో నిరక్షరాస్యులైన రైతులకు పూర్తిస్థాయిలో అవగాహణలేక నేటికి వేలాది మంది ఈ కేవైసీ చేయించుకోలేదు. ఈ విషయమై జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస్‌ను సంప్రదించగా పీఎంకిసాన్ సమ్మాన్ నిధి పథకంలో కేంద్రప్రభుత్వ నిబంధనల మేరకు లబ్ధిదారుల సంఖ్య తగ్గిపోతోంది. పథకం ప్రారంభంలో ఎలాంటి నిబంధనలు లేకపోవటంతో లబ్ధిదారుల సంఖ్య ఎక్కువగా ఉండేదన్నారు. ఉద్యోగులు రూ.10వేల పెన్షన్ పొందే రైతులు, ఆదాయపు పన్ను చెల్లించే పరిధిలోకి వచ్చే రైతులు, కుటుంబంలో ఒక్కరికి మాత్రమే ఈ పథకం వర్తింపు వంటి నిబంధనలతో క్రమేణా లబ్ధిదారుల సంఖ్య తగ్గుతోందని తెలిపారు.

కొత్త వారికి అవకాశం ఇవ్వాలి..



పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో కొత్తగా పాస్ పుస్తకం పొందిన రైతులకు కూడా అవకాశం ఇవ్వాలి. కేంద్రప్రభుత్వం 2019 ఫిబ్రవరికి ముందు పాస్ పుస్తకం ఉన్న వారికి మాత్రమే నగదు జమ చేస్తోంది. 2019కి ముందు నాకు 1.50ఎకరం ఉంటే 2019లో మరో ఎకరం ఉన్నప్పటికీ ఇంతవరకు పైసలు పడలేదు. నిబంధనలను సడలించాలి.

-ఎల్ రమేష్, సింగిల్‌గూడ

ఇలా వెళితే... రోడ్డుకు రక్షణ...



దండేపల్లి, జనవరి2(ఆంధ్రజ్యోతి): కేజ్‌వీల్స్ ట్రాక్టర్లతో రహదారులు దెబ్బతింటున్నాయి. రహదారి దెబ్బతినడంతో ప్రజలు ఇబ్బందులు పడడంతోపాటు ప్రజాధనం వృధా అవుతోంది. ఓ రైతు రహదారి దెబ్బతినకుండ కేజ్‌వీల్స్‌ను మరో ట్రాక్టర్ సాయంతో పొలానికి తీసుకువెళుతున్నాడు. ట్రాక్టర్ వీల్స్‌ను రోడ్డుకు తగలకుండా కట్టి తీసుకపోతున్నారు. గురువారం మేదరిపేట బస్టాండ్ ప్రాంతంలో ఇలా అగుపించాయి.

లక్ష డప్పులు, వెయ్యి గొంతులు కదంతొక్కాలి

మందమర్రి టౌన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా లక్ష డప్పులు, వెయ్యి గొంతులు కార్యక్రమానికి బీసీ కవులు, కళాకారులు, రచయితలు మద్దతు ఇవ్వాలని ఓయూ జేఏసీ నేత, ప్రజా కవి, గాయకుడు దరువు అంజన్న పేర్కొన్నారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శుక్రవారం నుంచి గ్రామాల్లో ప్రచారం చేస్తామన్నారు. 30 సంవత్సరాల క్రితం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ నేతృత్వంలో పోరాటం ప్రారంభమైందని, దీనికి అన్ని పార్టీలు, ప్రజాసంఘాలు మద్దతు తెలిపాయన్నారు. కేంద్రంతో పాటు సుప్రీంకోర్టు స్పందించి వర్గీకరణకు ఆమోదం తెలిపిందన్నారు. ఎస్సీలోని ఒక సామాజిక వర్గం సోదరులు అడ్డుకొంటుందని, ఇది సరి కాదని పేర్కొన్నారు. ఫిబ్రవరి 3న హైదరాబాద్‌లో లక్ష డప్పులు వెయ్యి గొంతుల సభ ఉందని, దీనికి సంఘీభావంగా బీసీ కళాకారులు పట్టణాల్లో చైతన్యవంతులను చేసేందుకు ప్రచార కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. తెలంగాణ కళాకారుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నకిరెకంటి కిరణ్‌కుమార్, సభ్యులు సత్యంరెడ్డి, శశిధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బైక్ దొంగతనం కేసులో ఒకరికి జైలు శిక్ష

జన్నారం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): బైక్ దొంగతనం కేసులో నిందితునికి లక్షెట్టిపేట కోర్టు జడ్జి సంవత్సరం జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ రాజవర్ధన్ తెలిపారు. జూలైలో మండల కేంద్రంలోని స్థానిక ఉడిపి హోటల్ ఎదుట కరీంనగర్ జిల్లా కొత్తపల్లి గ్రామానికి చెందిన మహ్మద్ బైక్ పార్క్ చేశాడు. అనంతరం చూసే సరికి బైక్ లేకపోవడంతో దొంగతనం జరిగినట్లు గుర్తించి జన్నారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. హైద్రాబాద్, నిజామాబాద్, ఆర్మూర్ ప్రాంతాల్లో ఇదే తరహాలు బైక్‌లు దొంగతనం జరగడంతోపాటు విచారణ చేపట్టగా మూటపల్లి పవన్ అనే వ్యక్తిని పట్టుకుని కోర్టులో హాజరుపర్చగా నిందితునికి జడ్జి సంవత్సరం జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. నిందితుడిని పట్టుకున్న కోర్టు కానిస్టేబుల్ మధుకర్, హెడ్‌కానిస్టేబుల్ గౌస్, కానిస్టేబుల్ తుకారాం, భాస్కర్‌లను ఎస్‌ఐ అభినందించారు.

టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్ల విడుదల



క్యాలెండర్లను విడుదల చేస్తున్న డీఈవో యాదయ్య, నాయకులు

గర్మిళ్ల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): డీఈవో కార్యాలయంలో గురువారం టీఎస్‌యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్, అధ్యాపకదర్శినిని డీఈవో యాదయ్య ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు కిరణ్ కుమార్, జిల్లా కోశాధికారి కిరణ్, కార్యదర్శులు దేవదాస్, చంద్రమౌళి, అబ్దుల్ వాహిద్, పోచన్న తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి



ఆదినారాయణను పరామర్శిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏమాజీ

బెల్లంపల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఆరిజన్ డెయిరీ ఎండీ ఆది నారాయణపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి హత్యాయత్నం కేసు నమోదు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజీ డిమాండ్ చేశారు. దాడిలో గాయపడి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆదినారాయణను గురువారం పరామర్శించారు. ఏమాజీ మాట్లాడుతూ ఆదినారాయణను ప్రజలందరి సమక్షంలో దుస్తులు విప్పి విచక్షణరహితంగా మారణాయుధాలతో హత్యాయత్నం చేశారన్నారు. ఆయనకు తీవ్రగాయాలైనా పోలీసులు నామమాత్రపు కేసులు నమోదు చేశారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో పెంచి పోషించిన రౌడీ షీటర్లు, భూకబ్జాదారులను ప్రస్తుత ఎమ్మెల్యే గడ్డం వినోద్ కాపాడుతున్నారని ఆరోపించారు. దాడి చేసిన నిందితులను అరెస్టు చేయాలన్నారు.

నిరుపేదలకు బ్లాంకెట్లు పంపిణీ



బ్లాంకెట్లు అందజేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, ఎస్సై ప్రసాద్

నెన్నెల, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మంచిర్యాల రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మండలంలోని కోనంపేటలో నిరుపేదలకు బ్లాంకెట్లు, దుస్తులు, టార్పలిన్ కవర్లు గురువారం పంపిణీ చేశారు. చలి తీవ్రత దృష్ట్యా అందజేశామని వారు చెప్పారు. గుడిసెల పైకప్పు సరిగ్గా లేని వారికి టార్పలిన్ కవర్లు ఇచ్చామని పేర్కొన్నారు. వృద్ధ, అనాథ ఆశ్రమాల ఏర్పాటు, రక్తదాన శిబిరాలతోపాటు మారుమూల గ్రామాల్లో వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్టు చెప్పారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్‌రెడ్డి, ఎస్సై ప్రసాద్, జనరల్ సెక్రెటరీ మహేందర్, సురభి శరత్‌కుమార్, అభినవ సంతోష్‌కుమార్, రాంటెంకి శ్రీనివాస్, లక్ష్మినారాయణ, మాజీ జడ్పీటీసీ భారతిశంకర్, మాజీ సర్పంచ్ తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ పోస్టర్ల విడుదల



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విద్యార్థులు, నాయకులు

వాంకిడి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల సాధనకై ఈనెల8న బీసీసంఘం ఆధ్వర్యంలో తలపెట్టిన చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని బీసీసంఘం నాయకులు అన్నారు. గురువారం చలో హైదరాబాద్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఉమేష్, వినోద్, మహేష్, మహేందర్, తిరుపతి, స్వాతి, స్వప్న, రోజ, ప్రమీల, పాయల్, హర్షిత, నవ్య, మాయ తదితరులు పాల్గొన్నారు.

జెండా పండుగను విజయవంతం చేయాలి

సిర్పూర్(టి), జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఈనెల8న జరిగే మన్నెవార్ (కొలావార్) జెండా పండగను విజయవంతం చేయాలని జిల్లా ఆదివాసీ మన్నెవార్ సంఘం అధ్యక్షుడు గంట గోపాల్ కోరారు. గురువారం మండలంలోని కేశవపట్నం, భూపాలపట్నం గ్రామాల్లో జెండా పండుగకు సంబంధించిన జెండాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఆదివాసీమన్నెవార్ సంఘం నాయకులు ఉన్నారు.

అర్హుల వివరాలనే నమోదు చేయాలి

జైనూర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ పథకంలో అర్హులైన వారి వివరాలనే సర్వేలో నమోదు చేయాలని జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్‌రావ్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం మార్కెట్ కమిటి చైర్మేన్ కుడిమెత విశ్వనాథ్‌రావ్ ఎంపీడీవో సుధాకర్‌రెడ్డితో మాట్లాడారు. ఇందిరమ్మఇళ్ల సర్వేను వేగవంతం చేయాలన్నారు. ఇంతవరకు మండలంలో 80శాతం సర్వే పూర్తయిందని ఎంపీడీవో తెలిపారు.

ఉత్పత్తి లక్ష్యాల సాధనకు కృషి చేయాలి

రెబ్బెన, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనకు అంతా కృషిచేయాలని బెల్లంపల్లి ఏరియా జనరల్‌మేనేజర్ ఎం శ్రీనివాస్ తెలిపారు. గురువారం గోలేటి జీఎం కార్యాలయంలో నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు 91శాతం బొగ్గుఉత్పత్తి సాధించినట్టు తెలిపారు. స్వచ్ఛత కార్యక్రమంలో బెల్లంపల్లి ఏరియాకు ద్వితీయ స్థానం వచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీనాయకులు బయ్య మొగిలి, ఎస్‌వోటూ జీఎం రాజమల్లు, పీవో నరేందర్, పర్సనల్‌మేనేజర్ ఆర్ తిరుపతి పాల్గొన్నారు.

నేషనల్ హైవే పనులను అడ్డుకున్న రైతులు

రామగిరి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదివారంపేట్ భూముల్లో నేషనల్ హైవే పనులను గురువారం రైతులు అడ్డుకున్నారు. నేషనల్ హైవేపనులకు సేకరించిన భూములకు నష్టపరిహారం చెల్లించనిదే పనులు జరగనిచ్చేంది లేదని గ్రామస్థులు అడ్డుకున్నారు. కాగా ట్రెంచ్ పనులు సత్వరం చేపట్టాలని కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం గ్రామానికి తహసీల్దార్ రామచంద్రరావు ఆధ్వర్యంలో ఆర్‌ఐ మహేష్, రవిశంకర్, పోలీసులు వెళ్లగా రైతులు అడ్డుకున్నారు.

మార్కెట్ అభివృద్ధికి పకడ్బందీ చర్యలు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్‌రావ్



ఆంధ్రజ్యోతి: మార్కెట్ అభివృద్ధికి నిధులు వచ్చాయా?

మార్కెట్ కమిటీ చైర్మన్: మార్కెట్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఇదివరకే ప్రతిపాదనలు పంపించాం. రానున్న రోజుల్లో జైనూర్ మార్కెట్ అభివృద్ధికి పకడ్బందీ చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి : మార్కెట్ కమిటీ పరిధిలో లైసెన్సులు కలిగిన వ్యాపారస్థులు ఎంతమంది ఉన్నారు

మార్కెట్ కమిటీ చైర్మన్ : మార్కెట్ పరిధిలో జైనూరు, లింగాపూర్, సిర్పూర్(యు), ఉట్నూరు మండలాలు ఉన్నాయి. ఇప్పటి వరకు 41మంది లైసెన్సులు కలిగిన వ్యాపారులు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి : ఆయామండలాల్లో చాలా మందికి లైసెన్సులు లేవనే ఆరోపణలున్నాయి. వారిపై చర్యలు తీసుకుంటారా?

మార్కెట్ కమిటీ చైర్మన్ : లైసెన్సులు లేని వ్యాపారులపై తప్పక కఠిన చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి : ఉట్నూరు ఎక్స్ రోడ్డు చెక్‌పోస్టుకు ఎంత ఆదాయం వచ్చింది.?

మార్కెట్ కమిటీ చైర్మన్ : ఉట్నూరు ఎక్స్ రోడ్డు వద్ద ఉన్న చెక్ పోస్టులో నవంబర్ నుంచి డిసెంబరు వరకు 10లక్షల రుపాయల ఆదాయం వచ్చింది. - జైనూర్



సంస్థ అభివృద్ధికి అంకిత భావంతో పనిచేయాలి



పదోన్నతి పత్రాలు అందజేస్తున్న జీఎం

మందమర్రి టౌన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): సంస్థ అభివృద్ధే లక్ష్యంగా ప్రతీఒక్కరు అంకితభావంతో పనిచేయాలని మందమర్రి జీఎం దేవేందర్ తెలిపారు. గురువారం జీఎం కార్యాలయంలో నూతన సంవత్సరం సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. కొత్త సంవత్సరంలో అందరు నూతనఆలోచనలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ప్రధానంగా ప్రమాదరహిత ఉత్పత్తే ధ్యేయమన్నారు. ప్రతీ ఒక్కరు విధిగా రక్షణసూత్రాలను పాటించాలన్నారు. పనిస్థలాల్లో సమస్యలుంటే అధికారుల దృష్టికితేవాలన్నారు. అనంతరం ఉద్యోగులకు పదోన్నతిపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీఎంసేఫ్టీ రఘుకుమార్, ఎస్‌వోటూ జీఎం విజయప్రసాద్, ఏఐటీయూసీ బ్రాంచికార్యదర్శి సలేంద్రసత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రోత్సాహకాలతో ఉత్పత్తిలో సత్ఫలితాలు

శ్రీరాంపూర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు ప్రోత్సాహకాలు అందిస్తే సత్ఫలితాలు సాధించవచ్చని ఆర్కే5,6గ్రూప్ ఏజెంట్ శ్రీధర్, ఆర్కే5గని మేనేజర్ సుధీర్ కుమార్‌ఝా అన్నారు. ఉత్పత్తి లక్ష్యం సాధించిన సందర్భంగా ఆర్కే5 గని ఉద్యోగులకు గురువారం ప్రోత్సాహక బహుమతులు అందించారు. ముఖ్య అతిథిగా వారిద్దరు హాజరై మాట్లాడుతూ మరోసారి టాప్‌టెన్ స్థానంలో నిలవాలని కోరారు. కార్మికులు గైర్హాజరు కాకుండా విధులు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో రక్షణాధికారి రాందాస్, సంక్షేమాధికారి రణదీప్ గౌడ్, అసిస్టెంట్ మేనేజర్ శివయ్య, అండర్ మేనేజర్లు, సూపర్‌వైజర్లు, మైనింగ్‌స్టాఫ్, ఉద్యోగులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

సొంతింటి పథకం అమలు చేయండి

మందమర్రిటౌన్/శ్రీరాంపూర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు సొంతింటి పథకం అమలు చేయాలని కోరుతూ గురువారం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి హైదరాబాద్‌లోని సచివాలయంలో సీపీఎం ఆధ్వర్యంలో సీపీఎం, సీఐటీయూ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ మాజీఎమ్మెల్యే దూలకంటి రాంగారెడ్డి, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మ రాజిరెడ్డి, మంద నర్సింహరావు కార్మికులు సొంతింటి పథకం లేక పడుతున్న ఇబ్బందులను వివరించారు. దీనిపై ఉపముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటస్వామి, అల్లి రాజేందర్, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

గతమెంతో ఘనం.. భవిష్యత్తే శూన్యం

- బొగ్గు ఉత్పత్తిలో వెనుకబడిన కాసిపేట గని
- ఆందోళనలో కార్మికులు

కాసిపేట, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మందమర్రి డివిజన్ పరిధిలోని కాసిపేట గని గతంలో బొగ్గుఉత్పత్తి, ఉత్పాదకతలో సింగరేణిలో ఆదర్శంగా నిలిచింది. 1997లో ప్రారంభమైన కాసిపేటగని రెండు దశాబ్దాల పాటు ఉత్తమగనిగా ఎంపికై ఎన్నో అవార్డులు, రివార్డులను సొంతం చేసుకుంది. కానీ నేడు ఆపరిస్థితి కనిపించడం లేదు. కార్మికులు, అధికారుల మధ్య కొరవడిన సమన్వయ లోపం, పనిముట్లు, పరికరాలు అందుబాటులో లేక నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోలేక 8 ఏండ్లుగా ఎదురీదుతోంది. జీరో యాక్సిడెంట్‌లతో ఉత్పత్తిసాధించాలని అధికారులు రక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నా పనిస్థలాలు సరిగ్గా లేక నిత్యం ఏదో ఒకచోట కార్మికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నిర్ధేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యసాధనలో వెనకబడడంతో పాటు అధికారుల నిర్లక్ష్యం వల్ల కాసిపేట గని కాలపరిమితి తగ్గి మూసివేతకు అతిసమీపంలో ఉందని కార్మికులు ఆందోళనవ్యక్తం చేస్తున్నారు.



కాసిపేట గని

● సగటు ఉత్పత్తి 60శాతమే..

2024-25 ఆర్థిక సంవత్సరంలో నిర్ధేశించిన బొగ్గుఉత్పత్తిలో కేవలం60శాతంతోనే కొనసాగుతోంది. ఈ యేడాది 2.40లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి వెలికితీయాలనే లక్ష్యాన్ని నిర్ధేశించగా కేవలం 60శాతం ఉత్పత్తి మాత్రమే తీయగలుగుతున్నారు. ఒకరోజులో 785టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాలి. కానీ పనిస్థలాలు సరిగ్గా లేక రోజువారీగా సగటున 550టన్నుల ఉత్పత్తి సాధిస్తున్నారు. దీంతో కాసిపేట గని ప్రతి యేటా నష్టాలను మూటగట్టుకుంటోంది.

● వేధిస్తున్న రక్షణ పరికరాల కొరత..

బొగ్గును వెలికితీయడంలో రక్షణ చర్యలకే అధిక ప్రాధాన్యత ఇచ్చే సింగరేణి యాజమాన్యం రక్షణపరికరాలు సరఫరా చేయడంలో మాత్రం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే ఆరోపణలు ఉన్నాయి.

డబుల్ స్టాఫ్ రేకులు అందుబాటులో లేక పార్కుల్లో కార్మికులు సేద తీరేందుకు కూర్చునే బెంచీల రేకులను కట్‌చేసి పనిస్థలాల్లో వినియోగిస్తున్నారంటే ఇక్కడున్న పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. త్రీఎస్11, ఫోర్ఎస్11లలో ల్యాండింగ్ లెవెల్ సరిగ్గా లేక టబ్బులు సకాలంలో చేరక ఉత్పత్తికి తీవ్రవిఘాతం కలుగుతోంది. సాండ్ స్టోవింగ్, తడకలు, రూఫ్ బోల్టులు, దాట్లు (తుంటలు) పనిస్థలాలు సక్రమంగా లేని ప్రమాదస్థలాల్లో ప్రాణాలను అరచేతిలో పెట్టు కుని పనులను చేస్తున్నామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాజమాన్యం రక్షణచర్యలు చేపట్టి నాణ్యమైన పనిముట్లు, రక్షణ పరికరాలు అందించాలని ఆందోళనలు, నిరసనలు చేపట్టిన ఘటనలు కూడా ఉన్నాయి. అయినా యాజమాన్యం స్పందించడం లేదని కార్మికులు పేర్కొంటున్నారు.

● అధికారులు, కార్మికుల మధ్య కొరవడిన సమన్వయం..

అధికారులు, కార్మికులమధ్య ఉండాల్సిన సత్సంబంధాలు కొరవడ్డాయి. అనుభవం లేని అధికారులు, కార్మికుల మధ్య సమన్వయం లేక ఉత్పత్తిలో విఫలం చెందుతున్నారు. కార్మికులను సమన్వయం చేసుకుని పనులను నిర్వహించడంలో అధికారులు విఫలమవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. 1200 మంది కార్మికులు ఉన్న కాసిపేట గనిలో 60శాతంమంది యువకార్మికులు ఉన్నారు. ఉన్నత చదువులు చదివిన యువకులు బొగ్గు ఉత్పత్తిలో తగినంత ఆసక్తి చూప డం లేదు. దీనికి తోడు గైర్హాజరు సమస్య అధికారులను తీవ్రంగా వేధిస్తోంది. ఈ ఏడాదిలో 36మంది జీరో మస్టర్ కార్మికులు ఉండగా 400మంది కార్మికులకు పైగా విధులకు సక్రమంగా హాజరు కావడం లేదు. దీంతో ఉత్పత్తి లక్ష్య సాధనలో వెనుకబడుతున్నారు. కార్మికులు, అధికారులు సమన్వయం చేసుకుని ముందుకు సాగాల్సిన అవసరం ఉంది.

● ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించేందుకు చర్యలు తీసుకుంటున్నాం..

- భూశంకరయ్య, కాసిపేట గని మేనేజర్

నైపుణ్యంగల అధికారులను కార్మికులతో సమన్వయం చేసుకుంటూ ఉత్పత్తి లక్ష్యాలను అధిగమిం చేందుకు చర్యలు చేపడుతున్నాం. సాండ్‌స్టోవింగ్, డబుల్‌స్టాఫ్ రేకులు తీసుకువచ్చేందుకు ఉన్నతాధికారులకు రిపోర్టు చేశాం. కార్మికుల హాజరు శాతం పెంచి ఉత్పత్తి లక్ష్యాలను అధిగమిస్తాం.

పని గంటలను మెరుగుపర్చుకోవాలి: సీఎండీ

శ్రీరాంపూర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు తమ పని గంటలను మెరుగుపర్చుకోవాలని సింగరేణి సీఎండీ ఎన్ బలరాం అన్నారు. గురువారం ఆయన తన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సింగరేణి ఉజ్వలభవిష్యత్ కోసం ప్రతిఒక్కరూ 8గంటలపాటు అంకితభావంతో పనిచేయాలని కోరారు. కొత్తఏడాదిలో నూతన లక్ష్యాలను నిర్దేశించుకొని సాధనకు కృషి చేయాలని ఉద్యోగులను ఆదేశించారు. కార్యక్రమంలో కనీస వేతనాల సలహామండలిచైర్మన్ జనక్‌ప్రసాద్, జీఎం(కో-ఆర్డినేషన్) ఎస్‌డీఎం సుభాని, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఎండీ బలరాం

యాసంగి సాగుకు కడెం ప్రాజెక్టు సిద్ధం

5వపేజీ తరువాయి

కడెం ప్రాజెక్టులో ఉన్న నీరు ఆరుతడి పంటలకే సరిపోతుందని చెబుతున్నారు. దీంతో యాసంగిలో వరికి బదులు ఆరుతడి పంటలు వేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

● సరిపడా నీరు ఉండడంతో..

ప్రాజెక్టుల్లో సరిపడా నీరు ఉండడంతో యాసంగి సాగుకు నీరు అందించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కడెం ప్రాజెక్టు మరమ్మతులు పూర్తయిన నేపథ్యంలో జనవరి 5వ తేదీ నుంచి నీరు విడుదల చేసేందుకు ప్రాజెక్టు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. కడెం ప్రాజెక్టు కింద డిస్ట్రిబ్యూటరీ 1 నుంచి 42 వరకు కాలవల ద్వారా సుమారు 16వేల ఎకరాలకు నీటిని విడుదల చేయనున్నారు. యాసంగికి నీరు అందనుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మన్మోహన్‌సింగ్ మరణం దేశానికి తీరని లోటు



మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని దివంగత మన్మోహన్‌సింగ్ మరణం దేశానికి తీరని లోటని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో మన్మోహన్‌సింగ్ సంతాపసభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అనేక ఆర్థిక సంస్కరణలు అమలు చేసి దేశాన్ని ముందుకు నడిపించిన మహనీయుడు అని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

మహేంద్ర సంఘం కార్యవర్గం

జన్నారం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కామన్‌పల్లి, దేవునిగూడ గ్రామాల మహేంద్ర సంఘం కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఒడిపల్లి సురేష్, ప్రధాన కార్యదర్శిగా నీలం నర్సింగం, కోశాధికారిగా కోడిజుట్టు రాజన్న, ప్రచార కార్యదర్శిగా వెంకటేష్‌లను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులను పలువురు సన్మానించారు.

ఆరు పదుల వయసులో యోగాసనాలు

- పలు అవార్డులు సాధించిన రమేష్
- ప్రజలకు, గని కార్మికులకు ఉచితంగా యోగా తరగతులు
- పిరమిడ్ ధ్యాన కేంద్రం ఏర్పాటు
- శాకాహారంపై విస్తృత ప్రచారం
- నెలలో ఒక రోజు అన్నదానం

మందమర్రి టౌన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి) : ఆరు పదుల వయసులో సైతం యోగా పోటీల్లో పాల్గొంటూ అవార్డులను సొంతం చేసుకుంటున్నారు మందమర్రికి చెందిన రమేష్. ప్రజారోగ్యమే ప్రధాన లక్ష్యంగా యోగాపై ఉచిత శిక్షణ ఇస్తున్నారు. ఆయన పాల్గొన్న ప్రతీ పోటీలో ప్రథమ బహుమతి సాధిస్తూ యువతకు రోల్ మోడల్‌గా నిలుస్తున్నాడు పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన కొంపల్లి రమేష్ అలియాస్ పెట్రోల్ బంక్ రమేష్ యోగా శిక్షకుడు. 2000 సంవత్సరంలో ఆరోగ్యం కోసం ప్రారంభించిన యోగా ఈరోజు ఆయన అనేక పోటీల్లో పాల్గొని బహుమతులను కైవసం చేసుకునే స్థాయికి ఎదిగాడు. ఆరు పదుల వయసులో వివిధ పోటీల్లో పాల్గొని బహుమతులు సాధిస్తున్నాడు. రోజు పనిలో ఎంత బిజీగా ఉన్నప్పటికీ ఆయన గంట పాటు యోగాసనాలు వేయడం మరువడు.

పిరమిడ్ ధ్యాన కేంద్రం ఏర్పాటు....

పట్టణంలోని రాష్ట్రీయ రహదారి పక్కన ఉన్న అతని నివాసం వద్ద కొంత స్థలంలో 2015లో పిరమిడ్ ధ్యాన కేంద్రం ఏర్పాటు చేశారు. ఆయన సతీమణి లత రమేష్ కూడా మహిళలకు శిక్షణ ఇస్తూ శ్వాసపై ధ్యాస అనే కార్యక్రమాలను కొనసాగించారు. కరోనా సమయంలో కూడా కొవిడ్ నియమ నిబంధనలు పాటిస్తూ ధ్యాన, యోగా నిర్వహించారు.

అన్నదానం...

నెలకు ఒకసారి రమేష్‌తోపాటు అతడి మిత్రులు రాష్ట్రీయ రహదారి పక్కన ఉన్న పెట్రోల్ బంక్ వద్ద అన్నదానం చేస్తున్నారు. తాను సంపాదించిన దానిలో కొంత ప్రజలకు వినియోగించాలనే లక్ష్యంతో అన్నదానం చేపడుతున్నారు.

అవలీలగా పలు ఆసనాలు

యోగాసనాలు వేయడంలో రమేష్‌కు సాటి లేరు. ఏకపాదబకాసన, పద్మమయురాసన, అష్టవక్రాసనం, పద్మశీర్షాసనం, వృచ్చికాసనం, వివిధ ఆసనాలను ఆయ న అవలీలగా వేస్తుంటారు. తన ఆరోగ్యానికి ఆసనాలే దోహదపడుతున్నాయని చెబుతుంటారు.



యోగాలో సాధించిన గోల్డ్ మెడల్‌తో రమేష్

యోగా పోటీల్లో 15కు పైగా అవార్డులు....

రాష్ట్రంలో ఎక్కడా యోగా పోటీలు జరిగినా అందులో పాల్గొంటూ బహుమతులు సాధిస్తున్నాడు. 2019 లో మందమర్రిలో జరిగిన జాతీయ స్థాయి యోగా పోటీల్లో ఓవరాల్‌గా చాంపియన్‌షిప్‌ను రమేష్ సాధిం చారు.



యోగాసనాలు వేస్తున్న రమేష్

అదే విధంగా బెల్లంపల్లిలో 2022, 2023, 2024 సంవత్సరాల్లో వరుసగా ఛాంపియన్ షిప్ సాధించారు.

● మందమర్రిలోని ఆయా గనుల, డిపార్టుమెంట్ల వద్ద యోగా గురువు రమేష్ కార్మికులకు యోగాసనాలు నేర్పిస్తున్నారు. ఉన్నతాధికారుల విజ్ఞప్తి మేరకు గని కార్మికులకు యోగా ఉపయోగాలు, ఆరోగ్య అంశాలను తెలియజేస్తూ శిక్షణ ఇస్తున్నారు.

● యోగా శిక్షకుడు రమేష్ యోగాతోపాటు ఆరోగ్యానికి సంబంధించి మంచి విటమిన్‌లతో కూడి న ఆకుకూరలు, పండ్లు తినాలని ప్రచారం చేస్తున్నారు. మాం సకృత్తులు వద్దు శాకాహారం ముద్దు అంటూ కూరగాయలు, పండ్లలో లభించే ప్రధాన విటమిన్లు తీసుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు. మాం సాన్ని భుజించడం వల్ల గుండెపోటు, మధుమేహంతో పాటు ఇతర వ్యాధులు వచ్చే అవకాశాలు ఉంటాయని ప్రచారం చేస్తున్నారు.

ఆరోగ్యానికి వ్యాయామం తప్పనిసరి...

ప్రతీ ఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి. వ్యాయామాలు తప్పనిసరిగా చేయాలి. పరిమిత విటమిన్లతో కూడిన భోజనాన్ని తీసుకోవాలి. ఉదయం వాకింగ్‌తోపాటు యోగా, ఇతర వ్యాయామాలు చేసుకోవాలి. వ్యాయామాలద్వారా వ్యాధులను అదుపు చేసుకోవచ్చు. వ్యాయామం అనేది దినచర్యలో భాగంగా భావించి క్రమం తప్పకుండా చేసేవారు 80 నుంచి 90 సంవత్సరాలకు పైగా జీవించే అవ కాశాలు ఉన్నాయి. ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకే యోగా శిక్షకుడిగా ఉచితసేవలు అందిస్తున్నాను. వారికి శిక్షణ ఇవ్వడం ద్వారానే నేను పాల్గొన్న ప్రతీపోటీలో బహుమతులు సాధించగలి గాను. - కొంపల్లి రమేష్, యోగా శిక్షకుడు

కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూములు

● చోద్యం చూస్తున్న అధికారులు



ముత్యంపల్లిలోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన ఇల్లు

కాసిపేట, జనవరి 2(ఆంధ్రజ్యోతి): అధికార పార్టీ నేతల అండదండలతో మండలంలోని ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయి. అయినా సంబంధిత శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలో ఉన్న మోడల్ స్కూల్ ప్రహరీ గోడను ఆనుకుని 102 సర్వే నెంబరులో మూడు ఎకరాల ప్రభుత్వ భూమిలో నుంచి ఎకరం భూమిని కబ్జాచేసి రెండు నెలలక్రితం ఇంటి నిర్మాణం చేపట్టారు. అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముత్యంపల్లి శివారులోని గ్రౌండ్ సమీపంలోని 213 సర్వే నెంబరులో 5 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమిస్తూ ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారు. మండలంలోని ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండా పోయిందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా కబ్జాదారుల నుంచి ప్రభుత్వ భూములను కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ భోజన్నను వివరణ కోరగా కబ్జా విషయం ఇటీవల తన దృష్టికి వచ్చిందని, రెవెన్యూ అధికారులను పంపించి స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రభుత్వ భూమిని కాపాడుతామన్నారు.

అసత్య ప్రచారాలు ఆపండి

జైపూర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రతిపక్షాలు కొందరు నాయకులను అడ్డుపెట్టుకుని సోషల్ మీడియాలో కాంగ్రెస్ పార్టీపై, ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామిపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని వాటిని మానుకోవాలని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఫయాజ్‌లు పేర్కొన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాకా కుటుంబం అంటేనే అభివృద్ధికి మారుపేరని, ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. కొందరు బీఆర్ఎస్, ఇతర పార్టీల నాయకులు అసత్య ప్రచారాలు మానుకోవాలన్నారు. బీఆర్ఎస్ హయాంలో వందల లారీలతో ఇసుకను అక్రమంగా తరలించారని, ఇప్పుడు నిబంధనల ప్రకారం ఇసుక రవాణా జరుగుతుందన్నారు.

ఉచిత నోటు పుస్తకాలు పంపిణీ

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ద్వారా విద్యార్థులకు ఉచిత లాంగ్ నోటు పుస్తకాలను అందజేశామని కలెక్టర్ కుమార్‌దీపక్ తెలిపారు. కలెక్టరేట్ కార్యాలయంలో గురువారం టీజీవో నాయకులు కలెక్టర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పూల మొక్కను అందించారు. అసోసియేషన్ తరుపున లాంగ్ నోటు పుస్తకాలను కలెక్టర్‌కు అందజేశారు. అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

తుది ఓటరు జాబితా ప్రచురణకు సిద్ధం



మాట్లాడుతున్న ఓటరు జాబితా పరిశీలకులు సురేంద్రమోహన్

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా సవరణలో భాగంగా చేపట్టిన ప్రక్రియ పూర్తి చేసుకుని తుది ఓటరు జాబితా ప్రచురణకు సిద్ధం చేశామని ఎన్నికల పరిశీలకులు సురేంద్ర మోహన్ అన్నారు. గురువారం కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ మోతిలాల్, సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లాతో కలిసి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన వారందరు ఓటరుగా నమోదు చేసుకోవడంతోపాటు, మరణించిన, చిరునామా మారిన, సవరణలు, తొలగింపులపై భారత ఎన్నికల సంఘం నిబంధనలకు అనుసరించి చర్యలు తీసుకొన్నామని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, ముసాయిదా, జాబితా ప్రచురణ, ఫిర్యాదులు, అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారం దశలు పూర్తి చేసుకుని తుది జాబితా ప్రచురణ అనుమతి కొరకు ఎన్నికల సంఘంకు పంపిం చామని, అనుమతి పొందిన అనంతరం ఈ నెల 6న తుది జాబితా ప్రచురిస్తామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ కార్యక్రమం జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించామని తెలిపారు. జాబితాపై వచ్చిన 434అభ్యంతరాలు, ఫిర్యాదులు స్వీకరించి 427 పరిష్కరించామన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సహకార సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాలు రైతుల పరపతిని పెంచి ఆర్థికంగా పరిపుష్టం కావాలని, రైతులకు విశిష్టమైన సేవలు అందించాలని అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి కల్పన, పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు శంకర్, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఏజీఎం రామ కృష్ణ, జెడ్పీ సీఈవో గణపతిలతో కలిసి సహకార సంఘాల ప్రతినిధులు, వ్యవసాయాధికారులు, బ్యాంకు మేనేజర్లు, సూపర్‌వైజర్‌లతో సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సంఘాల వ్యాపార లావా దేవీలు, సంఘం సిబ్బంది వివరాలు దృష్టిలో ఉంచుకుని రైతులకు ఉపయోగపడే విధంగా పునర్విభజన జరగాలన్నారు. సహకార సంఘాల పునర్విభజన రైతులకు ప్రయోజనకరంగా ఉండాలని తెలిపారు.

రేషన్ బియ్యం రవాణా పై చర్యలు తీసుకోవాలి

దండేపల్లి, జనవరి2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పేదలకు ఉచితంగా అందిస్తున్న రేషన్ బియ్యం కొనుగోలు చేసి అక్రమంగా రవాణా చేస్తున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని గుండ రవీందర్ డిమాండ్ చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పలు గ్రామాల నుంచి అక్రమంగా తరలిస్తుండగా పట్టుకొని అధికారులకు అప్పగించినా రవాణా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవడం లేదని ఆయన ఆరోపించారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం రవాణాను అరికట్టాలన్నారు. రేషన్ బియ్యం రవాణా చేస్తున్న వారిపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. రాజలింగు, లక్ష్మణ్, అశోక్, సాగర్, పోషన్న పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే ఆలయ అభివృద్ధి



మాట్లాడుతున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నరేష్

మంచిర్యాల క్రైం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): అందరి సహకారంతో రామలింగేశ్వర స్వామి ఆలయం అభివృద్ధి పనులు చేపడుతామని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్ అన్నారు. గురువారం ఆలయ అభివృద్ధికి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆలయానికి ఉత్తరద్వారంతో పాటు ఆలయం ఎదుట అభివృద్ధికి పలువురిని భూమిని ఇవ్వాలని కోరామన్నారు. ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు చొరవతో భూములు కోల్పోయిన వారికి భూములు ఇస్తామని హామీ ఇవ్వడంతో పలువురు ముందుకు వచ్చారన్నారు. వైకుంఠ ఏకాదశి రోజు ఉత్తర ద్వారా దర్శనం ప్రారంభిస్తామన్నారు. వెంకటేష్, కిషన్, వెంకటరామయ్య, శంకరయ్య, పోచయ్య, తూముల ప్రభాకర్, సుధీర్ పాల్గొన్నారు.

బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

జన్నారం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): బీడీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని బీడీ అండ్ సిగర్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకుడు దాసండ్ల రాజన్న పేర్కొన్నారు. గురువారం ఇందన్‌పల్లిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, అర్హులైన బీడీ కార్మికులకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలన్నారు. భాగ్యలక్ష్మీ, వనిత, మహేశ్వరి, లక్ష్మీ, సత్తవ్వ తదితరులు పాల్గొన్నారు.

పట్టణ నాయీబ్రహ్మణ సంఘం కార్యవర్గం



అధ్యక్షుడిని సన్మానిస్తున్న నాయకులు


నస్పూర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణ నాయీ బ్రహ్మణ సేవా సంఘం కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. పట్టణ గౌరవ అధ్యక్షుడిగా కుర్మిళ్ళ చంద్రయ్య, పట్టణ అధ్యక్షుడిగా ఎనగందుల వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా వేయిగండ్ల శ్రీకాంత్, వర్కింగ్ ప్రెసిడెంట్ కురిమిల్ల మోహన్‌లను ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులను సన్మానించారు. నాయీ బ్రహ్మణ సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

సంఘం పటిష్టతకు కృషిచేస్తా



అధ్యక్షుడిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే

మందమర్రి టౌన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఆదిజాంబవ సంఘం పటిష్టతే లక్ష్యంగా పని చేస్తానని సంఘం అధ్యక్షుడు పంబాల రాజనర్సు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలో ఏర్పడిన సంఘం అందరిని కలుపుకొని ముందుకెళ్తుందన్నారు. సంఘానికి సంబంధించి కార్యాలయం కోసం త్వరలోనే సింగరేణి జీఎంను కలిసి కోరుతామన్నారు. తనపై నమ్మకం ఉంచి ఎన్నుకున్న ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు అధ్యక్షుడిని సన్మానించారు. వర్కింగ్ ప్రెసిడెంట్ ఈదునూరి శంకర్, సభ్యులు దాసరి రాజనర్సు, తుంగపిండి శ్రీనివాస్, ఎనగందుల వెంకటి, మల్లయ్య, శంకర్, ఎ కర్నాకర్, శ్యాం, నెర్వెట్ల లక్ష్మణ్, ఎస్ రాజేషం, బచ్చలి బీమయ్య, సురేష్, బండ సారయ్య, రాజగట్టయ్య, తదితరులు పాల్గొన్నారు.



న్యూస్ బాక్స్

హమాలీ రేట్ల జీవోను విడుదల చేయాలి

తాండూర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పెరిగిన సివిల్ సప్లయి హమాలీ రేట్ల జీవోను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొండు బానేష్ పేర్కొన్నారు. గురువారం రేచినిలో హమాలీ కార్మికుడు చేస్తున్న సమ్మెకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. హమాలీ రేట్లను రెండు సంవత్సరాలకు ఒకసారి పెంచాలని, ఇన్సూరెన్స్, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. బోనస్ రూ.10 వేలకు పెంచాలన్నారు. వెంటనే సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. అంకేష్, లక్ష్మణ్, శ్రీనివాస్, చందు, మహేందర్, వెంకటేష్, భూమయ్య, గణేష్, సుమలత, సాయికుమార్ పాల్గొన్నారు.

సర్వేను వేగంగా పూర్తి చేయాలి



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజేశ్వర్

మందమర్రిరూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇండ్ల సర్వేను వేగంగా పూర్తి చేయాలని ఎంపీడీవో రాజేశ్వర్ సూచించారు. గురువారం సారంగపల్లి, ఆదిల్‌పేట, అందుగులపేట గ్రామాల్లో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సర్వే పూర్తి పారదర్శకంగా ఉండాలని, అన్ని వివరాలను సేకరించాలని సూచించారు. అనంతరం నర్సరీని పరిశీలించారు. కార్యదర్శులు వీరేందర్, సురేష్ పాల్గొన్నారు.

యాసంగి సాగుకు కడెం ప్రాజెక్టు సిద్ధం

- రూ. 10 కోట్లతో మరమ్మతులు పూర్తి
- ఆయకట్టు రైతులకు తీరనున్న సాగునీటి కష్టాలు
- ఈ నెల 5న నీటి విడుదలకు సన్నాహాలు





కడెం ప్రాజెక్టు

మంచిర్యాల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నిర్మల్, మంచిర్యాల జిల్లాల రైతాంగానికి సాగునీరు అందించే కడెం ప్రాజెక్టు మరమ్మతులు పూర్తయ్యాయి. గత ఏడాది వర్షాకాలంలో భారీగా నీరు చేరడంతో ప్రాజెక్టు ఆనకట్ట దెబ్బతినడంతోపాటు పలు గేట్లు మొరాయించాయి. నీటి లీకేజీ కారణంగా సకాలంలో నీరందక ఆయకట్టు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. బీఆర్ఎస్ హయాంలో ప్రాజెక్టుకు మరమ్మతులు చేపట్టాలని భావించినా అది కార్యరూపం దాల్చలేదు. దీంతో ప్రాజెక్టుపై ఆధారపడ్డ రైతాంగానికి సాగునీరు అందలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి రూ.10 కోట్లు కేటాయించడంతో ఆనకట్టతో పాటు గేట్ల మరమ్మతు పనులు పూర్తికావడంతో యాసంగి సీజన్‌కు సాగునీటికి ఇబ్బందులు తొలగిపోయాయి. కడెం ప్రాజెక్టు ద్వారా నిర్మల్ జిల్లాతోపాటు మంచిర్యాల జిల్లా జన్నారం, దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాల్లో సాగునీరు అందుతోంది. యాసంగిలో కడెం నీటిని డిస్ట్రిబ్యూటరీ 1 నుంచి 28 వరకు పరిధిలో సాగు నీరు అందించనున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటిని దండేపల్లి మండలం గూడెం గోదావరి నది ఒడ్డున ఉన్న సత్యనారాయణస్వామి ఎత్తిపోతల పథకం ద్వారా డిస్ట్రిబ్యూటరీ 30 నుంచి 42 వరకు సాగునీరు అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.


● ట్రయల్‌రన్ విజయవంతం..

యాసంగి సాగు కోసం ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటిని గూడెం ఎత్తిపోతల పథకం ద్వారా అందించేందుకు ఇటీవల ట్రయల్ రన్ నిర్వహించగా విజయవంతమైంది. దీంతో నీటి విడుదలకు ఇబ్బందులు తొలగిపోయాయి. కడెం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు. కాగా ప్రస్తుతం 605 అడుగుల నీరు ఉంది. ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 20.175 టీసీఎంసీలకు ప్రస్తుతం 19.56 టీఎంసీలు ఉంది.

మిగతా 7లో

కొందరికే పీఎం కిసాన్ సమ్మాన్

- పథకంలో ఏటా తగ్గుతున్న లబ్ధిదారుల సంఖ్య
- అవగాహన లేక నష్టపోతున్న అన్నదాతలు



6

ఆరుపదుల వయసులో యోగాసనాలు

- పలు అవార్డులు సాధించిన రమేష్
- ప్రజలకు, గని కార్మికులకు ఉచితంగా యోగా తరగతులు
- పిరమిడ్ ధ్యాన కేంద్రం ఏర్పాటు
- శాకాహారంపై విస్తృత ప్రచారం
- నెలలో ఒక రోజు అన్నదానం

7

ఏబీ బర్ధన్ స్ఫూర్తితో ముందుకు సాగాలి

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు సైద్ధాంతిక తత్వవేత్త ఏబీ బర్ధన్ స్ఫూర్తితో ముందుకు సాగాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో బర్ధన్ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్ మాట్లాడుతూ బర్ధన్ చివరి శ్వాస వరకు కమ్యూనిస్టు సిద్ధాంతాలను అనుసరించి ప్రజలతో, కార్యకర్తలతో నిరాడంబరమైన జీవితాన్ని గడిపారన్నారు. నాయకులు రామడుగు లక్ష్మణ్, కలీందర్‌ఖాన్, మల్లయ్య, నగేష్, రవి, పౌలు, పోచన్న, శంకరయ్య, రామన్న, నర్సయ్య, జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో కామ్రేడ్ బర్ధన్ వర్ధంతిని సీపీఐ నాయకులు నిర్వహించారు. బర్ధన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ కార్యదర్శి రాజమౌళి, సీనియర్ నాయకులు చిప్ప నర్సయ్యలు మాట్లాడుతూ ప్రజల హక్కుల సాధనకు బర్ధన్ ఎన్నో పోరాటాలు చేశారన్నారు. 1957లో నాగాపూర్ అసెంబ్లీ స్థానానికి పోటీ చేసి గెలిచారన్నారు. 16 సంవత్సరాలు పార్టీ కార్యదర్శిగా పనిచేసి కార్మికులు, ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేశారన్నారు. ఆయన స్ఫూర్తితో నాయకులు, కార్యకర్తలు ముందుకు సాగాలన్నారు. నాయకులు లక్ష్మీనారాయణ, గుండ చంద్రమాణిక్యం, మేకల రాజేశం, కొంకుల రాజేష్, రత్నం రాజం, రాంచందర్, నాయకులు స్వామిదాస్, రాజమల్లు,రాధాకృష్ణ పాల్గొన్నారు.



బర్ధన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్, నాయకులు

ఏజెన్సీ భూముల కబ్జా వాస్తవమే...!

- నిర్ధారించిన రెవెన్యూ అధికారులు
- అక్షర సత్యమైన 'ఆంధ్రజ్యోతి' కథనం
- సమగ్ర విచారణకు ఐటీడీఏ పీవో ఆదేశాలు
- భూ సర్వే అనంతరం హద్దులు ఏర్పాటు

మంచిర్యాల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం ముత్యంపేట గ్రామంలో గిరిజన (ఏజెన్సీ) భూములు కబ్జాకు గురైన విషయం వాస్తవమేనని తేలింది. ఈ మేరకు గురువారం గ్రామంలో సర్వే జరిపిన రెవెన్యూ అధికారులు భూములు కబ్జాకు గురైనట్లు నిర్ధారించారు. ఏజెన్సీ భూములను స్వాధీనం చేసుకున్న కబ్జా దారులు అందులో రైస్‌మిల్లు కూడా ఏర్పాటు చేశారు. ఈ విషయమై 'ఏజెన్సీ భూమి కబ్జా' శీర్షికన నవంబరు 12న 'ఆంధ్రజ్యోతి' జిల్లా అనుబంధంలో కథనం ప్రచురితమైంది. కథనంపై స్పందించిన కలెక్టర్ కుమార్ దీపక్‌తో పాటు, ఉట్నూరు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా దండేపల్లి తహసీల్దార్‌కు సమగ్ర విచారణ జరిపించాలని ఆదేశాలు జారీ చేశారు.

అన్యాక్రాంతం ఇలా....

ముత్యంపేట గ్రామం ఏజెన్సీ ప్రాంతంలో ఉంది. ఇక్కడ గిరిజన చట్టాలైన 1/70, పేసా చట్టాలు అమలులో ఉన్నాయి. అయినప్పటికీ గిరిజనేతరులైన ఇద్దరు బడా వ్యక్తులు భూములను కబ్జా చేశారు. కబ్జా చేసిన భూమిలో ఓ వ్యాపారి ఏకంగా రైస్‌మిల్లు నిర్మించాడు. సదరు భూముల బహిరంగ మార్కెట్ విలువ రూ.కోటిపైనే ఉంది. ముత్యంపేట గ్రామంలో ఏజెన్సీ భూములను గిరిజనేతరులు ఆక్రమించి ఎలాంటి అనుమతులు లేకుండా, కనీసం గ్రామ పంచాయతీ ట్రేడ్ లైసెన్స్ కూడా పొందకుండా మినీ రైస్‌మిల్లు ఏర్పాటు చేశాడు. అయితే అదే భూమిని ఉట్నూరులోని ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ ఇళ్లు లేని పలువురు గిరిజనులకు ఇంటి స్థలాల కోసం కేటాయిస్తూ గతంలో ఆదేశాలు జారీ చేశారు. పీవో ఆదేశాల మేరకు భూమిని ఇళ్లు లేని పేదలకు పంచాల్సి ఉండగా, స్థానిక రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా అవి అన్యాక్రాంతమయ్యాయి. ఈ విషయమై గ్రామస్థులు కొందరు అక్టోబరు 28న కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితం కావడంతో కలెక్టర్ సూచనల మేరకు అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్ నవంబరు 26న అక్రమంగా రైస్ మిల్లు ఏర్పాటు చేసిన స్థలంపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. లేఖ ఇచ్చిన నాటి నుంచి గరిష్ఠంగా 7 రోజులలోపు నివేదిక సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు. అడిషనల్ కలెక్టర్ ఇచ్చిన గడువు ముగియడం, సర్వే చేపట్టకపోవడంతో గ్రామస్థులు ఉట్నూరు ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తాకు ఫిర్యాదు చేశారు.



సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

ఎట్టకేలకు కదిలిన యంత్రాంగం....

కలెక్టర్, ఐటీడీఏ పీవో ఆదేశాలతో తప్పని సరి పరిస్థితుల్లో మండల రెవెన్యూ యంత్రాంగం కదిలింది. గురువారం ఉదయం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భూమన్న, సర్వేయర్ వినోద్, తదితరులు సదరు భూముల్లో సర్వే జరిపారు. విచారణలో సర్వే నెంబరు 17లో మొత్తం 1.12 ఎకరాల ఏజెన్సీ భూములు కబ్జాకు గురైనట్లు అధికారులు నిర్ధారించారు. అందులో గతంలో గిరిజనులకు ఇళ్ల స్థలాల కోసం కేటాయించిన 34 గుంటల భూమి కూడా ఉన్నట్లు తేల్చి బౌండరీలు ఏర్పాటు చేశారు. కబ్జాకు గురైన 34గుంటల్లో 10గుంటలతోపాటు దాని పక్కనే ఉన్న సర్వే నెంబరు 18లోనూ మరో35 గుంటలు కబ్జా చేసిన వ్యాపారి ఆ స్థలంలో రైస్ మిల్లును నిర్మించాడు. భూముల సర్వే పూర్తయినందున సంబంధిత నివేదికను తహసీల్దార్ ఐటీడీఏ పీవోకు అందజేయనున్నారు. అధికారుల సర్వేలో భూములు కబ్జా గురయ్యాయని నిర్ధారణ కావడంతో 'ఆంధ్రజ్యోతి' కథనం అక్షర సత్యమైంది.



జ్యోతి మంచిర్యాల జిల్లా వార్తలు
ఏజెన్సీ భూమి కబ్జా

ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం

ప్రభుత్వ వశమయ్యేనా....?

ముత్యంపేటలో కబ్జాకు గురైన ఏజెన్సీ భూములు తిరిగి ప్రభుత్వం స్వాధీన చేసుకుంటుందా అనే సందేహాలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాలతో సర్వే జరిపిన రెవెన్యూ అధికారులు సదరు భూముల్లో హద్దులు ఏర్పాటు చేశారు. అనంతరం భూముల్లో ఉన్న చెట్లను తొలగించేందుకు ఎక్స్‌కావేటర్ తెప్పించారు. పనులు ముగించుకొని అధికారులు వెళ్లి పోగానే ఎక్స్‌కావేటర్ డ్రైవర్‌ను కొందరు బెదిరించడంతో పనులు నిలిపివేసి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఈ విషయమై కలెక్టర్, ఐటీడీఏ పీవో ఎలా స్పందిస్తారనేది ఆసక్తిగా మారింది. భూమిని సర్వే చేసిన ఆర్ఐ నివేదికను తహసీల్దార్‌కు, అక్కడి నుంచి ఐటీడీఏ పీవోకు వీలైనంత త్వరగా అందజేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఆపరేషన్ స్మైల్‌ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

మంచిర్యాల క్రైం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు ఆపరేషన్ స్మైల్ విజయవంతం చేయాలని రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. గురువారం పోలీసు కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెలలో జరిగే ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతీ ఒక్కరు అంకితభావంతో పని చేయాలన్నారు. ప్రతీ ఒక్క అధికారి ముగ్గురు పిల్లలను రెస్క్యూ చేయాలన్నారు. ప్రతీ ఒక్కరి జీవితంలో బాల్యం అమూల్యమైందన్నారు. చిన్న చిన్న విషయాలకే కొందరు తల్లిదండ్రులను విడిచి దూరంగా ఉంటున్నారన్నారు. అలాంటి వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని, తప్పిపోయిన పిల్లలను వెతికి దర్పన్ అప్లికేషన్ ద్వారా వారిని గుర్తించి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఎదుట హాజరుపర్చి తల్లిదండ్రులకు అప్పగించాలన్నారు. బాల కార్మికుల గురించి సమాచారం ఇవ్వడానికి హెల్ప్‌లైన్ 1098, లేదా 112 నంబర్ల గురించి ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఇటుకబట్టిలలో, వివిధ రకాల పరిశ్రమలు, రైల్వే, బస్ స్టేషన్లలో పరిశీలించి కుటుం బాలకు దూరంగా ఉంటున్న పిల్లలను గుర్తించాలన్నారు. అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, ఏసీపీ మల్లారెడ్డి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా రవాణా శాఖ అధికారి సంతోష్‌కుమార్‌తో కలిసి రోడ్డు భద్రత మాసోత్సవాల సంబంధిత గోడ ప్రతులను విడుదల చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు, ఇతర వాహనచోదకులు సీటు బెల్టు ధరించాలన్నారు. వేగంగా వాహనాలు నడపవద్దని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపవద్దన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా రోడ్డు భద్రత నిబంధనలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వినోద్‌కు మంత్రి పదవి రావాలని పూజలు

కాసిపేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు మంత్రి పదవి రావాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ ఆధ్వర్యంలో అరుణాచలం ఈశ్వరుని యాత్ర చేపట్టి ప్రత్యేక పూజలు చేశారు. గురువారం ఎమ్మెల్యేను కలిసి దేవస్థానం శాలువా, లడ్డు ప్రసాదాన్ని అందజేశారు. నాయకులు రమేష్, జనార్దన్‌రెడ్డి, రమేష్, రాజమౌళి, పౌలు, రాజన్న పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి



కండ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని గురువారం జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు జిల్లా కేంద్రంలో గురువారం కండ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ అధికారంలోకి వస్తే బీసీ డిక్లరేషన్ అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పిందన్నారు. బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు చేయాలని, ప్రతీ జిల్లా కేంద్రంలో బీసీ భవనం నిర్మించాలని, ఎంబీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే పోరాటాలు చేస్తామన్నారు. నాయకులు గుమ్ముల శ్రీనివాస్, భీమ్‌సేన్, బిక్షపతి, చంద్రమౌళి, సతీష్, రాజేశం, సతీష్‌తదితరులు పాల్గొన్నారు.

టీఎన్‌జీవో సభ్యత్వ నమోదు

హాజీపూర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): గుడిపేట బెటాలియన్, తహసీల్దార్ కార్యాలయం, అగ్రికల్చర్ కార్యాలయాల్లో గురువారం టీఎన్‌జీవో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 40 మంది నాన్‌గెజిటెడ్ ఉద్యోగులకు సభ్యత్వం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, కార్యదర్శి రామ్మోహన్, కేంద్ర సంఘం కార్యదర్శి మల్లయ్య, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపురావు, తహసీల్దార్ శ్రీనివాస్ రావుదేశ్‌పాండే, గోపాల్, సందీప్, శర్మ తదితరులు పాల్గొన్నారు.

గుడిపేటలోని బెటాలియన్‌లో కమాండెంట్ వెంకటరాములుకు జిల్లా అధ్యక్షుడు శ్రీహరి పూల మొక్కను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఈ నెల 6న ఉచిత కంటి వైద్య శిబిరం

కాసిపేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యంపల్లిలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 6న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు శిబిరం నిర్వాహకులు ఉస్కమల్ల రాజేంద్ర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.